సర్వీసు రోడ్లకు మోక్షమెప్పుడో..?

- ఆర్‌యూబీ అందుబాటులోకి వచ్చి ఏడాది దాటినా పూర్తికాని పనులు
- రాకపోకలకు తప్పని తిప్పలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు



రోడ్డు కన్నా ఎత్తులో ఉన్న మ్యాన్‌హోల్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పరిసర ప్రాంత వాసులకు ఆర్‌యూబీ సర్వీసు రోడ్డు కష్టాలు తప్పడం లేదు. మధురానగర్ ఆర్‌యూబీ అందుబాటులోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంత వరకు సర్వీసు రోడ్లకు మాత్రం మోక్షం లభించలేదు. ఎప్పటికప్పుడు సర్వీసు రోడ్డు పనులు పూర్తిచేస్తారని ఆశగా ఎదురుచూడటం తప్ప ఇక్కడ మాత్రం పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు. దీంతో ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగించే మధురానగర్, పసుపుతోట, వీవీనరసరాజు రోడ్డు, నేతాజీ కాలనీ, సాయిబాబా కాలనీ, బుడమేరు మధ్యకట్ట, విజయ దుర్గా నగర్, దేవీనగర్, జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, భానూనగర్, సత్యనారాయణపురం రైల్వేకాలనీ, దుర్గాపురం తదితర ప్రాంత వాసులు నానాయాతన పడుతున్నారు. రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో పాటు అంతర్గత అప్రోచ్ రోడ్ల పనులు కూడా అలాగే ఉండిపోయాయి. దీంతో మలుపులు తిరిగేటప్పుడు వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

దుమ్ము, ధూళితో శ్వాసకోస వ్యాధులు

సర్వీసు రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ఇక్కడ వాహనచోదకులు రాకపోకలు సాగించే క్రమంలో దుమ్ము, ధూళి లేచి శ్వాసకోస వ్యాధులు వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే వర్షాకాలంలో ఇక్కడ రోడ్డు మీద వర్షంనీరు నిలిచిపోయి బురదగా మారుతున్నాయి. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఆర్‌యూబీ వద్ద అధికారుల నిర్లక్ష్యం వల్ల తమకు ఇబ్బందులు తప్పడం లేదని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాళ్లుతేలిన రోడ్లు

సర్వీసు రోడ్డు పనులు పూర్తిచేయకపోవడంతో రోడ్డుపై కంకర తేలిపోయి ప్రమాదకరంగా మారింది. చిన్న కంకర కావడంతో తరచూ వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. అలాగే వాహనాలు సైతం తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సక్రమంగా లేకపోవడం వల్ల డిస్క్ వంటి అనారోగ్య సమస్యలు సైతం వస్తున్నాయని వాపోతున్నారు.


కంకర తేలి ఉన్న సర్వీసు రోడ్డు

తరచూ ప్రమాదాలు

ఆర్‌యూబీ నుంచి సర్వీసు రోడ్డుకు మలుపు తిరిగే క్రమంలో తరచూ వాహనాలు ఢీకొంటున్నారు. ఆర్‌యూబీ నుంచి వేగంగా వచ్చిన వాహనచోదకులు ఒక్కసారిగా వాహనాలను అదుపు చేయలేక పక్కకు తిరుగుతున్న వాహనాలను ఢీ కొడుతున్నారు. అలాగే యూజీడీ మ్యాన్ హోల్, మురుగు కాలువలు సర్వీసు రోడ్డులో యూజీడీ మ్యాన్‌హోల్, మురుగు కాలువలు రోడ్డు కన్నా ఎత్తులో ఉన్నాయి. దీంతో రాత్రిపూట చీకటిలో రాకపోకలు సాగించే క్రమంలో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ సర్వీసు రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని వారు కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు



సాయిబాబాకాలనీ, పసుపుతోట సర్వీస్ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలు సాగించే క్రమంలో దుమ్ము లేచి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలకు గురై గాయాలబారిన పడుతున్నారు. అలాగే వాహనాలు సైతం పాడవుతున్నాయి. అధికారులు స్పందించి సర్వీసు రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి.

– కాకాని వెంకటరత్నం, మధురానగర్

మెడికల్ విద్యార్థుల అక్రమ అరెస్టు దుర్మార్గం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జ్ మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైద్య విద్యార్థులకి సకాలంలో రిజిస్ట్రేషన్ చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తూ శాంతియుతంగా నిరసన చేస్తున్న వైద్య విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం ప్రభుత్వపు దుర్మార్గపు చర్య అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య విద్యార్థులపై పోలీసులు, ప్రభుత్వ తీరును వైఎస్సార్ సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. డాక్టర్స్ డే రోజునే మంత్రి వైద్య విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. వైద్యుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నాన్చుడు ధోరణి వ్యవహరిస్తూ 13 నెలలుగా మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పోలీసులను ఉపయోగించుకుని అరెస్ట్ చేయడం, వైద్య విద్యార్థులపై దాడి చేయడంతో పాటు వారిని ఏఆర్ గ్రౌండ్స్‌లో నిర్బంధించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటని అన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం మెడికల్ విద్యార్థులకు ఎఫ్ఎంజీ పెర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వం దిగొచ్చేంత వరకు వైఎస్సార్ సీపీ నేతృత్వంలో వైద్య విద్యార్థులకు అండగా ఉండి ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు.

నగర సుందరీకరణకు భంగం కలిగిస్తే చర్యలు

అధికారులకు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం


నగర పర్యటనలో అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర సుందరీకరణకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం ప్రకాశం బ్యారేజ్, వన్ టౌన్, ఎంజీ రోడ్, బెంజ్ సర్కిల్, రామవరప్పాడు రింగ్ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర సుందరీకరణపై ఉద్యానవన, ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్మాణ వ్యర్థాలు, కేబుల్ వైర్లు నగర సుందరీకరణకు భంగం కలిగించేలా కనిపించినా వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రతిరోజు ప్లానింగ్ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్మాణ వ్యర్థాలు ఎక్కడా లేకుండా చూసుకోవాలని, అధికారులకు ఎప్పటికప్పుడు వాటిపై నివేదికను సమర్పించాలని అన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా ఉంచాలని ఎప్పటికప్పుడు రోడ్లను పరిశుభ్రపరుస్తూ, వ్యర్థాలను వెంటనే తొలగించాలని ప్రజారోగ్య సిబ్బందికి తెలిపారు. పగిలిపోయిన పుట్‌పాత్‌లు, పాడైపోయిన డివైడర్లు గుంతలు పడిన రోడ్లను ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకుంటూ మరమ్మతులు చేయిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలకృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీలో రెవెన్యూపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ప్రతి అసెస్‌మెంట్‌లకు పన్నులు ఉండాలని, ఖాళీస్థలాలు, ఆస్తిపన్నులు, నూతన ఇళ్లు, భవనాలు తదితర వాటిపై పన్నులు విధించాలని వీఎంసీ డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ)జి.సృజన అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యలయంలోని నూతన భవనంలో ఉన్న మీటింగ్ హాల్లో గురువారం ఆమె రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో జరుగుతున్న సర్వే స్థితిగతులను సమీక్షించారు. ఈ సర్వేలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో గల అన్ని ఖాళీ స్థలాలు, ఖాళీ స్థలాలుగానే ఉన్నాయా లేదా వాటిలో ఇల్లు నిర్మించారా, ఒకవేళ ఇళ్లను నిర్మిస్తే వాటికి తగ్గట్టుగా ఖాళీ స్థలాల పన్నును ఇంటి పన్నుగా మార్చాలని, ఇంటి పన్నులు ఉన్న అసెస్మెంట్లకు నగరపాలక సంస్థ జారీ చేస్తున్న డిమాండ్‌కు తగ్గట్టుగా ఉందా లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. భవనాలకు అదనపు గదులు, ఫ్లోర్లు నిర్మించిన, ఆ మార్పుకు తగిన విధంగా పన్నును ఈ సర్వే ద్వారా మార్చాలని ఆదేశించారు. వార్డు అడ్మిన్ సెక్రటరీలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి కచ్చితంగా ఈ సర్వేను పూర్తి చేయాలని, నగర వాసులు కూడా వీఎంసీ సిబ్బంది తమ వద్దకు వచ్చినప్పుడు సహకరించాలని, పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, బి.శ్రీనివాసరావు, ఏయూబీ శర్మ, రెవెన్యూ ఆఫీసర్లు, ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద నిరోధంపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వీఎంసీ అగ్నిప్రమాద నిరోధ అధికారులు

పటమట(విజయవాడతూర్పు): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు విద్యార్థులు కంగారు, ఆందోళన పడకుండా ప్రమాదాల నిరోధానికి కృషి చేయాలని వీఎంసీ డిస్ట్రిక్ట్ ఫైర్ అధికారి మాల్యాద్రి అన్నారు. వీఎంసీ అగ్నిప్రమాద నిరోధం విభాగం ఆధ్వర్యంలో ఆయన గురువారం అజిత్‌సింగ్‌నగర్‌లోని శ్రీరామ్ హైస్కూల్, గుణదల మడోనా కళాశాలల్లో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నిరోధంపై డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించే విధానం, మంటలను ఎలా ఆర్పాలి, ఎలాంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రవ్య నాటక సవ్యసాచి రామ్మోహన్‌రావు


సి.రామమోహన్‌రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న హరగోపాల్, పీవీఎల్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రంగస్థల, సినీ నటుడు, నాటక రచయిత – దర్శకుడు – ప్రయోక్త, ఆకాశవాణి విజయవాడ కేంద్రం విశ్రాంత సీనియర్ అనౌన్సర్, శ్రవ్య నాటక సవ్యసాచి చివుకుల రామమోహన్‌రావు చిరస్మరణీయుడని పలువురు కళాకారులు, కళాసంస్థల ప్రతినిధులు అన్నారు. సి.రామమోహన్‌రావు జయంతి సందర్భంగా పీవీఎల్ నృసింహం బృందం, కళామంజరి సాంస్కృతిక సంస్థ, శ్రీవిజయదుర్గా నాట్యమండలి, సి.రామమోహన్‌రావు కల్చరల్ అసోసియేషన్, చివుకుల కుటుంబసభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం గుణదలలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో స్టాఫ్ ఆర్టిస్ట్‌గా, అనౌన్సర్‌గా విధులు నిర్వర్తిస్తూనే రేడియో కార్యక్రమాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన రామమోహన్‌రావు చిరస్మరణీయుడని కొనియాడారు. ఎంతోమంది కళాకారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారికి మెరుగైన శిక్షణ ఇచ్చి రేడియో నాటకానికి, రంగస్థల నాటకానికి ఉన్న వ్యత్యాసాన్ని చూపించారని గుర్తు చేశారు. డైలాగ్ మాడ్యులేషన్‌లో రేడియో, రంగస్థల కళాకారులకు శిక్షణ ఇచ్చి 'కింగ్ ఆఫ్ డైలాగ్'గా ఖ్యాతి గడించారని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రేడియో, నాటక ప్రదర్శనలకు అనేక అవార్డులు పొందటమే కాకుండా ఆనందభైరవి, నెలవంక, నిప్పులాంటి మనిషి, సీతారామ కల్యాణం తదితర చిత్రాలలో నటించారన్నారు. తొలుత రామమోహన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి రేడియో, రంగస్థల నాటక రంగానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

దోమల నియంత్రణపై అవగాహన కల్పించాలి

వీఎంసీ బయాలజిస్ట్ కామేశ్వరరావు


మలేరియా విభాగం సిబ్బందికి సూచనలిస్తున్న బయాలజిస్ట్ కామేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని వీఎంసీ బయాలజిస్ట్ వాడపర్తి కామేశ్వరరావు పేర్కొన్నారు. వీఎంసీ బయాలజిస్ట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి మలేరియా విభాగం – 3 డివిజన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలను ఏ విధంగా నియంత్రించాలి వాటి వల్ల కలిగే వ్యాధులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మలేరియా విభాగం సిబ్బందిపై ఉందన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతతోపాటు నివాసాల్లో ప్రతిరోజూ వాడుకునే నీరు నిల్వ ఉండకుండా చేయాలని చెప్పారు. నీరు నిల్వ ఉన్నట్లయితే అందులో ఎన్నిరకాల దోమలు ఉత్పత్తవుతాయో ప్రజలకు వివరించాలన్నారు. విధులు నిర్వహించే క్రమంలో ఎటువంటి అలసత్వం వహించవద్దని, దోమల రహిత నగరంగా తీర్చిదిద్దే విషయంలో ప్రజలతోపాటు సిబ్బంది కూడా సహకరించాలని సూచించారు. వ్యాధులు సంక్రమించినట్లయితే, అటువంటివారిని గుర్తించి సమీపంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలకు పంపించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మలేరియా విభాగ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌స్పెక్టర్ అనీల్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

25 మందికి జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 25 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. నగరంలో రెండు, నాల్గవ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 25 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారిని ఆరవ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట పోలీసులు హాజరు పరిచారు. వారిలో ఐదుగురికి ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున రూ.75 వేలు, మరో 20 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున రూ.2 లక్షలు, అందరికీ కలిసి రూ.2.75 లక్షలు జరిమానా విధించారు. ప్రతిరోజూ నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని, పట్టుబడిన వారికి జరిమానాలు విధిస్తామని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

పవర్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని అప్పుడే జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోగలరని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి సూచించారు. కళాశాలలో గురువారం మురళీకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యాన పవర్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి మురళీకృష్ణ ట్రస్ట్ పవర్‌స్కిల్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ట్రస్ట్ ప్రతిరోజూ రెండు గంటల పాటు విద్యార్థులకు ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మురళీకృష్ణ ట్రస్ట్ డైరెక్టర్ వెంకట్, మేనేజింగ్ డైరెక్టర్ అర్జున్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు భువన విజయం గ్రంథావిష్కరణ

విజయవాడ కల్చరల్: కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు రచించిన భువన విజయం కథలు గాథలు గ్రంథావిష్కరణ కార్యక్రమం 5 వ తేదీ శనివారం సాయంత్రం హోటల్ ఐలాపురంలో నిర్వహిస్తునట్లు కృరసం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాన్ని ఏపీ హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద్ ఆవిష్కరిస్తారని చెప్పారు. రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, సమాచార హక్కు పూర్వపు కమిషనర్ ఐలాపురం రాజా పాల్గొంటారని తెలిపారు.


21న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు చలో విజయవాడ

ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్


సమావేశంలో మాట్లాడుతున్న రామలింగారెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 21న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రామలింగారెడ్డి తెలిపారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 21న రామవరప్పాడు రింగ్ నుంచి విద్యుత్ సౌధ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారి యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు తెలంగాణ రాష్ట్రంలో తరహాలో నేరుగా జీతాలు చెల్లించాలని, నగదు రహిత అపరిమిత ఆరోగ్య పాలసీ విద్యుత్ ఉద్యోగులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో అధికార యంత్రాంగం, ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ అనుబంధంగా ఉన్న విద్యుత్తు కార్మిక సంఘాలు పోరాటానికి సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఈనెల 8 నుంచి 21వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తామన్నారు. చలో విజయవాడ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే మల్లికార్జునరెడ్డి, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకాశి తదితరులు పాల్గొన్నారు.

'సుపరిపాలన'లో సమస్యల ఏకరువు


కండ్రికలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమా

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 64వ డివిజన్ కండ్రికలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కండ్రికలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ నేపథ్యంలో స్థానికులు రేషన్ కార్డులో కొత్త పేర్లు నమోదుకు ఈకేవైసీ కావడం లేదని స్థానిక ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకి ఏకరవు పెట్టారు. అలాగే గ్యాస్ డబ్బులు పడటం లేదని కొందరు మహిళలు చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన గురించి ప్రజలకు వివరించారు. ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకొనగా భిన్నాభిప్రాయాలను వ్యక్త పరిచారు. స్మార్ట్ మీటర్లను తమ ప్రమేయం లేకుండా ఇళ్లల్లో ఏర్పాటు చేస్తున్నారని దాని వల్ల కరెంట్ బిల్లు అధికంగా వస్తున్నట్లు తెలిపారు. ఆ ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ నాయకులు కే రవికుమార్, ఎస్‌కే బాబు, పీ భాగ్యలక్ష్మి, రాజేష్, బాబు, భవాని, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కళాకారులు కులమతాలకు అతీతులు

విజయవాడకల్చరల్: కళాకారులు కులమతాలకు అతీతులని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సమితి, సి.రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు ఎస్వీ రంగారావు 107వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ నవరస నటుడు ఎస్వీఆర్ అని అభివర్ణించారు. కళామంజరి వ్యవస్థాపకుడు పీవీఎల్ నృసింహం మాట్లాడుతూ ఎస్వీఆర్ ఏ పాత్రనైనా అవలీలగా పోషించగలడని కొనియాడారు. ఆయన నటించిన నర్తనశాల చిత్రం అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించినట్లు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన అల్లూరి మార్కండేయ రాజు, హరగోపాల్ పాల్గొన్నారు. అతిథులు ఎస్వీఆర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి


మాట్లాడుతున్న ఈగెల్ ఐజీ రవికృష్ణ

గుణదల(విజయవాడతూర్పు): మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు మత్తు పదార్థాలను నిర్వీర్యం చేసే దిశగా సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈగెల్ ఐజీ ఎ.రవికృష్ణ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలోని దేవయ్య ఆడిటోరియంలో గంజాయి అక్రమ రవాణా, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రవికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. డీసీపీ కేజీవీ సరిత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా పాటుపడాలని సూచించారు. గంజాయి రవాణా చేసే అసాంఘిక శక్తులపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపుతుందన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈగెల్ విభాగం ఎస్పీ నగేష్‌బాబు, లయోల కళాశాల రెక్టర్ ఫాదర్ పీఆర్ జాన్, ప్రిన్సిపాల్ ఫాదర్ మెల్కియోర్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి జి.సహాయ భాస్కరన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్మార్ట్ స్ట్రీట్‌లో స్టాళ్ల కేటాయింపునకు దరఖాస్తులు ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): వీధి విక్రయదారుల జీవనోపాధిని మెరుగుపరచేందుకు, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్(ఎన్ఎల్‌యూఎం)2.0 ద్వారా నగరంలోని భవానీపురంలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్‌లో వీధి విక్రయాలు జరుపుకొనేందుకు విక్రయదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో స్మార్ట్ స్ట్రీట్‌ను భవానీపురంలోని ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్నామని, ఈ మేరకు ఇటీవల టౌన్‌వెండింగ్ కమిటీ(టీవీసీ) కూడా 40 స్టాల్స్ ఏర్పాటు చేయటానికి తీర్మానించిందన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ లోపు నగరంలోని ఆసక్తి కలిగిన వీధి వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. అభ్యర్థులకు 16–17వ తేదీల్లో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని యూసీడీ(అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్), టీవీసీ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు 18 ఏళ్లు నిండాలని, దరఖాస్తుదారులు తప్పనిసరిగా వీధి వ్యాపారాలు చేయాలని, వారి పేర్లు కూడా వీఎంసీలో వీధి విక్రయదారులుగా నమోదు కావాలని, అభ్యర్థులు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్కు, మూడు ఫొటోలతో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని యూసీడీ విభాగంలో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు.

పీఎన్‌బీఎస్‌లో అదనంగా మరో 119 కుర్చీలు ఏర్పాటు



బస్టాండ్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల సౌకర్యార్థం పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో అదనంగా 119 మూడు సీట్ల కుర్చీలు ఏర్పాటు చేసినట్లు పీఎన్‌బీఎస్ డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు. ప్రతి రోజు 1.40 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగానే బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉండే సమయంలో ఇబ్బంది పడకుండా ప్రస్తుతం ఉన్న 187 మూడు సీట్ల కుర్చీలతో పాటుగా కొత్తగా 119 మూడు సీట్ల కుర్చీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యం కోసం వాటిని డిపార్చర్ బ్లాక్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు మన్యం వీరుడు అల్లూరి జయంతి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీగోకరాజు రంగరాజు కల్యాణ మండపంలో శ్రీ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యాన శుక్రవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సాంస్కృతిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సుబ్బరాజు, దాట్ల భాస్కరరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, కార్పొరేటర్లు పెనుమత్స శిరీష, శర్వాణీమూర్తి, మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు పాల్గొంటారని తెలిపారు. అల్లూరి జయంతి పురస్కరించుకుని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ డీజీపీఎన్ రాజు, పర్వతారోహకుడు భూపతిరాజు అనిష్‌వర్మలకు సత్కారం జరుగుతుందన్నారు. అనంతరం శ్రీఅల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం ఆధ్వర్యాన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు.

మహిళా ఉద్యోగిపై దాడి.. కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సచివాలయ మహిళ ఉద్యోగిపై దాడి చేసిన తండ్రి కొడుకులపై గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. సర్వేలో భాగంగా ఇంటి కొలతలు తీసుకుంటున్న గవర్నర్‌పేట 23వ డివిజన్ 98వ సచివాలయ అడ్మిన్ సెక్రటరీ అర్చనపై భవన యజమానికి కంతేటి నాగవెంకట రంగనాయకులు, ఆయన కుమారుడు కంతేటి యతిరాజ్ నిక్షిత్ దాడి చేసిన విషయం తెలిసిందే. దీనిపై అడ్మిన్ సెక్రటరీ అర్చన బుధవారం రాత్రి గవర్నర్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడరూరల్: పంచాయతీరాజ్ శాఖలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి అధికారి పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బి.విగ్నేస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాల నియామకం చేపడతామన్నారు. విద్యార్హత పోస్టు గ్రాడ్యుయేట్, ట్రయిబల్ స్టడీస్ లేదా సోషియాలజీ, సోషల్ వర్క్, యాంత్రోలజీ(స్టడీ ఆఫ్ హ్యూమన్) పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లేదా రూరల్ డెవలప్‌మెంట్ ఉండాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఒక పోస్టు, జిల్లా స్థాయిలో నాలుగు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.